క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతి పేట గ్రామానికి చెందిన వినోద్ 12 రోజుల కిందట ఉప్పునుంతల మండలంలోని తాడూరు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు 2010–2011 బ్యాచ్ చెందిన స్నేహితులు సోమవారం సందీప్ కుటుంబాన్ని పరామర్శించి రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు చంద్రశేఖర్, రామ్‌శేఖర్, హరికృష్ణ గౌడ్, నరేష్, భాస్కర్, గణేష్, శ్వేత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ బాధితులకు న్యాయం చేయాలి

చారకొండ: మండల కేంద్రంలో బైపాస్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండపల్లి బాలస్వామి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. గతంలో 15 రోజులుగా బాధితులు రిలే నిరాహార దీక్షలు చేయడంతో అధికారులు, ఎమ్మెల్యే హామీతో తాత్కాలికంగా రిలేదీక్షలు విరమించారన్నారు. కాని అధికారులు నేటి వరకు బాధితుల పక్షాన ఇళ్ల స్థలాలకు ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో బాధితుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, బాధితులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసులుగౌడ్

అచ్చంపేట రూరల్: తెలంగాణ స్పెషల్ స్కూల్స్ అసోసియేషన్‌ను సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా చలమల శ్రీనివాసులు గౌడ్, జనరల్ సెక్రెటరీగా గుమ్మడం శివసాగర్, ఉపాధ్యక్షుడిగా సుమన్, నాగరాజు, కోశాధికారిగా సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవేందర్, జాయింట్ సెక్రెటరీలుగా ఉపేందర్, ఉమాదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దీపిక, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సుబ్బలక్ష్మిలు ఎన్నికయ్యారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వాలు ప్రైవేట్ రంగంలోను రిజర్వేషన్లు కల్పించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వేములవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమవేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రైవేట్ సంస్థల్లో జనాభా ప్రాతిపాదికన, రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులను సామాజిక, ఆర్థిక, రాజకీయ అణచివేతల నుంచి సమానత్వాన్ని సాధించేందుకు సంఘటితంగా చైతన్యం చేసేందుకు రాష్ట సమావేశాలు వేముల వాడలో జరుగుతున్నాయని దళిత అభ్యున్నతికి దిక్సూచిగా మారతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు శివవంకర్, జక్కయ్య, లక్ష్మయ్య, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఉప్పునుంతల: అందరికి అందుబాటులో విశ్వకర్మ యోజన ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విశ్వకర్మ యోజన లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ మోహన్‌లాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న ట్రెనింగ్ సెంటర్లు దాదాపుగా వంద కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అక్కడికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఒక వేళ సెంటర్‌కు ఆలస్యంగా వెళితే అక్కడి సిబ్బంది సెంటర్‌లోపలికి అనుమతించకపోగా భోజన వసతి కల్పించడంలేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అచ్చంపేటలో ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. రమేష్‌గౌడ్, మాన్యాచారీ, సత్యనారాయణ, పర్వతాలు, రాజు, మహేష్, శివశంకర్, రవి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన రైతు పరశురాములు(48) గుండెపోటుతో సోమవారం మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రైతు తన కుమారులతో కలిసి వ్యవసాయ పొలంలో పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగాలేదని కుమారుల తో చెప్పి చెట్టుకింద నిద్రించాడు. ఎంతకీ లేవకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం



మేడిపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

24 నర్సరీలలో పూర్తైన బ్యాగ్ ఫిల్లింగ్ పనులు

తాడూరు: గ్రామల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఉపాధి సిబ్బందితో నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నారు. అధికారులు నిరంతరం సందర్శిస్తూ కూలీలకు సలహాలు ఇస్తున్నారు. అధికారులు మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా స్థలాలను ఎంపిక చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మొక్కల పెంపకానికి నర్సరీల నిర్వహణ పనులు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 1,49,508 మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అధికారులు గతేడాది కంటే ముందుగానే ఈ సారి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశారు. అన్ని



ఎత్మతాపూర్‌లో కవర్లలో మట్టిని నింపుతున్న కూలీలు

గ్రామ పంచాయతీలలోని నర్సరీలలో విత్తనాలు నాటే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిరంతరం మండల అధికారులు నర్సరీలను సందర్శిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు తగిన సూచనలు చేస్తున్నారు.

1,98000 మొక్కలు సిద్ధం...

మండలంలో ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యం మేరకు అధికంగానే మొక్కలు పెంచేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 1,49,508 లక్ష్యం కాగా అదనంగా 48,492 మొక్కలు సిద్ధం చేశారు. ప్రతి పంచాయతీకి లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు అవసరమైన బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశారు. అదేవిధంగా మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తిస్తున్నారు.

పండ్ల, పూల మొక్కలకు ప్రాధాన్యం

మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో పండ్ల మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు నాటే పనులు పూర్తై మొలకలు మొలకెత్తాయి. గత సంవత్సరం మిగిలిన మొక్కలు కూడా పచ్చగా కళకళలాడుతూ నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈత, కానుగ, నేరుడు, గుల్మోర, సీతాఫలం, తులసీ, మర్రి, చింత, సపోట, బాదం, కరివేపాకు, నిమ్మ, దానిమ్మ, జామ మొక్కల విత్తనాలను నాటించినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద నాటుకునేందుకు వీలుగా గులాబీ, గన్నేరు, మందారం, నందివర్ధన, బొప్పాయి, మునగ వంటి మొక్కలకు సంబంధించిన విత్తనాలు నాటినట్లు వారు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో సారవంతమైన ఎరువులతో కలిపిన ఎర్రమట్టిని బ్యాగుల్లో నింపాం. వాటిలో విత్తనాలను నాటించాం. ఇప్పటికే అక్కడక్కడ విత్తనాలు మొలకెత్తాయి. 2025 జూలై నాటికి మొక్కలు నాటేందుకు సిద్ధం ఉంచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ముందుకు వెళ్తున్నాం.

– చంద్ర సిద్ధార్థ, ఏపీఓ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఇతరులు

ఉప్పునుంతల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ గోదాం వద్ద వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి వేరుశనగను కొనుగోలు చేస్తుందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులను నిలువునా ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన సన్నరకం వరి ధాన్యానికి అదనంగా రూ. 500ల బోనస్ ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కేఎల్ఐ కాలువలతోపాటు అచ్చంపేట లిప్ట్ ఇరిగేషన్‌లో భాగంగా ఇటీవల ఉమామహేశ్వర లిప్ట్ రిజర్వాయిర్ పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. త్వరలో లక్ష్మీచెన్నకేశవ లిప్ట్ పనులను ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, ఎంపీడీఓ మోహన్‌లాల్, సీఈఓ రవీందర్‌రావు, నాయకులు అనంతరెడ్డి, జంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లేష్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, మల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు నారాయణ్‌రెడ్డి, శ్రీను, లింగమయ్య, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట్‌రాములు

కల్వకుర్తి రూరల్: పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ వెంకట్‌రాములు అన్నారు. సోమవారం మండలంలోని కురుమిద్ద, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలోని మురుగుకాల్వలను పరిశీలించారు. పంచాయతీ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కురుమిద్ద గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఐలీషా తదితరులు ఉన్నారు.

తాగునీటి వసతుల కల్పనకు చర్యలు



పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ నర్సింహరావు

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌కు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి వసతుల కల్పనకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలలో తాగునీటి వసతి కల్పించాలని ఉపాధ్యాయులు మాజీ కౌన్సిలర్ నర్సింహరావును కోరగా ఆయన మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం పాఠశాల వద్ద మున్సిపల్ సిబ్బంది తాగునీటి పైప్‌లైన్ కనెక్షన్ కోసం మాజీ కౌన్సిలర్‌తో కలిసి చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు అర్జున్‌గౌడ్, కట్టా నరేందర్‌రెడ్డి, గాల్‌రెడ్డి, సుధాకర్‌సింగ్, రాధాకృష్ణ, ఉపేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దకొత్తపల్లి: అచ్చంపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు దామోదర్, గురుప్రతిభ కనబర్చి రాష్ట స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం ఎంఈఓతో పాటు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పిబాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలన



మరికల్‌లో పాత ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్‌లో సోమవారం ఇందిరమ్మ ఇంటి స్థలాలను, పాత ఇళ్లను ఎంపీడీఓ లక్ష్మీదేవి పరిశీలించారు. మొదటి జాబితాలో మంజూరైన ఇళ్ల లబ్ధిదారుల ఇంటి స్థలాలను, పాత ఇళ్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి, రెండో జాబితాలో ఎంతమంది లబ్ధిదారుల ఉన్నారని పంచాయతీ కార్యదర్శి యాదయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని నర్సరీలో మొక్కల పెంపకం పరిస్థితిని కార్యదర్శిని, ఉపాధిహామీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

తిమ్మాజిపేట/ అమ్రాబాద్/ఉప్పునుంతల/: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. తిమ్మాజిపేట మండలంలోని గొరిట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అమ్రాబాద్ మండలం పదరలో మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఉప్పునుంతల మండలంలోని కాంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా అధికారులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రారంభానికి నోచుకోని బస్‌షెల్టర్



తాడూరు: మండల కేంద్రంలో రూ.లక్షల వ్యయంతో నాలుగేళ్ల కిందట నిర్మించిన బస్‌షెల్టర్, మరుగుదొడ్లు నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలకేంద్రంలో నిర్మించిన బస్‌షెల్టర్, మరుగుదొడ్లు ప్రారంభించకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు స్థలంలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకొని బస్‌షెల్టర్‌తో పాటు మరుగుదొడ్లను ప్రారంభించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి



హాజరైన అధికారులు

వెల్దండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తునట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయా గ్రామాల ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు ప్రజావాణిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఏఓ శోభారాణి, శ్రీమతి, తదితరులు ఉన్నారు.

గుండాలలో శాంతిపూజ



వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో కోనేరులో పడి విద్యార్థి మృతి చెందడంతో సోమవారం వేద పండితులు శాంతిపూజ, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. టీటీడీ ప్రముఖ శైవాగమ పండితులు సహస్రప్రతిష్టాచార్య బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి గణపతి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా దేవాలయ ఆవరణాన్ని శుద్ధి చేయించారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాద్, వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణశర్మ, నరహరిశర్మ, శివశర్మ, సురేష్‌శర్మ, సంతోష్‌శర్మ, వేద పండితులు తదితరులు ఉన్నారు.

డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు



నాగర్‌కర్నూల్‌రూరల్: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సోమవారం డీవైఎఫ్ఐ యువజన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు ఆధ్వర్యంలో చేపట్టారు. ఉద్యమ నాయకుల స్ఫూర్తితో డీవైఎఫ్ఐ సంఘంలో యువతీ, యువకులు చేరాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు శివమల్లికార్జున్, మహేష్, అంజి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాందేవ్ రెడ్డి తల్లి మృతిచెందింది. అదేవిధంగా ఇప్పలపల్లిలో పార్టీ నాయకుడు పాండురంగారెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇప్పలపల్లిలో మొక్కజొన్న మిషన్‌లో చేయి పడి యువకుడు పాండురంగారెడ్డికి తీవ్రగాయాలు కావడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీఎమ్మెల్యే వెంట మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోపిగౌడ్, మురళీధర్, నాయకులు అయూబ్‌ఖాన్, హుస్సేనీ, స్వామి, రమేష్ పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు

తెలకపల్లి: మండలకేంద్రమైన తెలకపల్లిలోని శివగంగా ఫంక్షన్ హాల్ ఎదురుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి లీకేజీ అవుతోంది. సోమవారం మిషన్ భగీరథ అధికారులు ఏఈ రవి ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. జేసీబీ సహాయంతో పనులు నిర్వహిస్తునట్లు ఏఈ తెలిపారు. మండలంలో పూర్తిస్థాయిలో లీకేజీలు లేకుండా చూస్తామన్నారు.



జేసీబీతో లీకేజీ సరిచేస్తున్న మిషన్ భగీరథ అధికారులు

ఘనంగా పోచమ్మ దేవతకు బోనాలు

కొల్లాపూర్: పట్టణంలో పోచమ్మ దేవతకు సోమవారం భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ దేవతల నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించారు. కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చారు. పట్టణంలోని రంగదాసు వీధి, ఆర్టీసీ బస్‌డిపో పక్కన, వరిదేల చెరువు కట్ట కింద, ఎస్సీ హాస్టల్ సమీపంలో, 16 వవార్డులో బోనాల పండుగను నిర్వహించారు. ఉత్సవాలను రైతుసంఘం నాయకులు పర్యవేక్షించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కోడేరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని బావాయిపల్లి, జనుంపల్లి, తీగలపల్లి గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కార్మికులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా పెంచుతున్న మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజుమాబేగం పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



అమ్రాబాద్: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి హెచ్చరించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు పదర మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 నుంచి 31వ తేదీ మార్చి 2024 వరకు మొత్తం 70 రకాల పనులను సంబంధించిన వివరాలను సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో వెల్లడించారు. వివిధ పనులల్లో అక్రమాలు జరిగాయని ఇందుకోసం రూ. 12836 ల రికవరీకి అధికారులు ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి కృష్ణారావు, ఎస్ఆర్‌పీ బద్రు, ఏపీఈపీఓ అంజి,ఈసీ కృష్ణ ఉన్నారు.

మహిమాన్వితం రాయలగండి క్షేత్రం

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు

అమ్రాబాద్: భక్తుల కోర్కెలు తీర్చుతూ పదర మండలంలోని రాయలగండి క్షేత్రం మహిమాన్వితంగా వెలుగొందుతోంది. ఆలయంలో కొలువు దీరిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నారు. మద్దిమడుగు ప్రధాన రహదారిలో అటవీ ప్రాంతంలోని ప్రకృతి రమణీయ ప్రదేశంలో మందాకిని నదిఒడ్డున(మందవాగు) 300 అడుగుల ఎత్తైన కొండపై లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్ల చేశారు. నిత్యన్నదానం కూడా నిర్వహించ నున్నారు. ఎంతో ప్రసిద్ధికెక్కిన ఈ ఆలయంలో దళితులే పూజారులుగా కొనసాగడం విశేషం. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రభోత్సవాలను సాంస్కృతిక కార్యక్రమాలతో క్షేత్రానికి తీసుకొస్తారు.



విద్యుత్‌కాంతులతో ఉత్సవాలకు ముస్తాబైన చెన్నకేశవ ఆలయం

నేడు లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయ 10:00 గంటలకు లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి నల్లమల కళాకారులతో దూందాం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 5న అర్ధరాత్రి నుంచి వివిధ గ్రామాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ప్రభోత్సవాలను రాయలగండి క్షేత్రానికి తీసుకొస్తారు. సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదనకు అన్ని ఏర్పాట్లు చేశారు. 6నస్వామివారి నాగవెల్లి అనంతరం వివిధ నాటకాల ప్రత్యేక ఘట్టాల ప్రదర్శన కొనసాగనుంది.

ఆలయ చరిత్ర ఇది

రాయలగండి క్షేత్రాన్ని పూర్వం పగిడిగుట్ట, సువర్ణగిరి అని పిలిచేవారు. ఆలయంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి లోకకళ్యాణం కోసం కొలువుదీరినట్లు భక్తుల నమ్మకం. పూర్వం ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న చింతకుంటప్రభువులలో ఒకరైన చింతకుంట రంగారావులు ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శాసనం తెలుస్తోంది. క్రీ.శ.1536 సెప్టెంబరు11న దుర్ముఖి నామ సంవత్సరం బాద్రపద ఏకాదశి మంగళవారం ఆలయాన్ని ప్రారంభించినట్లు శాసనంలో ఉంది. రంగారావు నిర్మించడంతో రంగరాయుని గండిగా మారిన ఈ క్షేత్రం కాలక్రమేన రాయులగండిగా ప్రసిద్ధికెక్కింది. పూర్వం నుంచి కూడా ఆలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణ, ఆలయ పూజారులుగా దళితులే ఉండటం విశేషం.

భక్తిశ్రద్ధలతో చిన్న రథోత్సవం



వెల్దండ: మండలంలోని గుండాలలో సోమవారం తెల్లవారుజామున చిన్న రథోత్సవం నిర్వహించారు. రథంపై అంబా రామలింగేశ్వర స్వామి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, ఆలయ అర్చకులు ఉన్నారు.